## ఖుత్బా జుమా సారాంశము

18-04-2014

తషహ్హుద్ తఅవ్వుజ్ మరియు సూరా ఫాతిహా తరువాత సయ్యద్‌నా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇలా ఉపదేశించారు.

అల్లాహ్ తాలా యథార్థము, స్థాయి గురించి హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం వ్రాసిన కొన్ని వాక్యములను నేను ఇప్పుడు పేర్కొనుదును. అల్లాహ్ తాలా సర్వ శక్తులకు అధికారి, అద్వితీయుడు. అతడు సర్వ ప్రాణులకు సృష్టికర్త, అతడు తప్ప ప్రతిది నాశనమగును. ఆన్ హజ్రత్ సల్లల్లాహు అలైహి వ సల్లం ద్వారనే ఈ ప్రపంచ సృష్టికర్తను పొందగలము. అతడు సాటిలేని సౌందర్యము, అనుగ్రహము గలవాడు. అతడి ప్రకృతిని తిలకించాలంటే స్వచ్ఛమైన మనస్సుతో అతని వైపు వంగుట అనివార్యము. అతడిని ఆరాధించుట తప్పనిసరి. మానవుడు ఈ స్థితిని పొందినట్లైతే అల్లాహ్ తాలా పరుగెత్తుకుంటూ వచ్చి మానవున్ని ఆలింగనము చేసుకొని అనుగ్రహ వర్షము కురిపించును. అల్లాహ్ తో సంబంధమేర్పరుచుకొనినచో నీ ఇహపరలోకాలు చక్కబడును.

అల్లాహ్ వాస్తవికతను వివరిస్తూ హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం ఇలా ప్రస్తావించారు. అల్లాహ్ భూమ్యాకాశముల కాంతి, అనగా ఎత్తుపల్లములలో కనబడు ప్రతి కాంతి. అది ఆత్మలలో గలదైనా, శరీరంలో గలదైనా, అంతర్గత బహిర్గతములో గలదైనా అనగా ప్రతి కాంతి అల్లాహ్ వైపు నుండి వచ్చును. అల్లాహ్ తాలా సాధారణ అనుగ్రహము ప్రతి వస్తువును ఆవరించి యున్నది. అతని అనుగ్రహము పొందకుండ ఏదీ లేదు. అల్లాహ్ తాలా పవిత్ర ఖురాన్ లో తన గుణముల గురించి ఇలా ఉపదేశించాడు.

قُلْ هُوَ اللّٰهُ اَحَدٌ اَللّٰهُ الصَّمَدُ لَمْ يَلِدْ۔وَلَمْ يُوْلَدْ وَلَمْ يَكُنْ لَّهٗ كُفُوًا اَحَدٌ۔

" నీవు ఇట్లనుము. అల్లాహ్, అతడొక్కడే. అల్లాహ్ స్వయంభువు. అతడు ఎవరికి జన్మనివ్వలేదు. అతడు ఎవరికి జన్మించలేదు. అతనికి ఎన్నడూ ఎవ్వడు సమానుడు కాలేదు." మానవుని జ్ఞానమునకు ఉపాధ్యాయుడు కావలెను. మానవుడు పరిమిత జ్ఞాని. కాని అల్లాహ్ తాలా జ్ఞానమునకు ఏ శిక్షకుడు అవసరం లేదు. అతడు అపరిమిత జ్ఞాని. మానవునికి వినుటకు గాలి అవసరం,అదికూడ పరిమితమే. కాని అల్లాహ్ స్వశక్తితో వినును, అది అపరిమితం. మానవునికి చూచుటకు సూర్యుడు లేదా ఇతర వెలుతురు అవసరం. ఆ చూపు కూడ పరిమితమే. కాని అల్లాహ్ స్వంత కాంతితో చూచును. అది అపరిమితం. అలాగే మానవుడు మానవునికి జన్మనివ్వాలంటే ఏదైనా పదార్థము, సమయము కావలెను. అది కూడ పరిమితమే . కాని అల్లాహ్ దేనినైనా పుట్టించదలచినచో అతడికి పదార్థము, సమయము అవసరం లేదు. అతడు అపరిమిత శక్తులు, సాటిలేని గుణాలు గలవాడు. అతడు నిరుపమానమైనట్లు అతడి గుణాలు కూడ నిరుపమానమైనవి. అతడు ఒక గుణములో తుచ్ఛమైనచో అన్ని గుణాలలో తుచ్ఛ మగును. కనుక అతడు తన స్వభావములో నిరుపమాని అయినట్లే గుణములలో కూడ నిరుపమాని. అప్పుడే అతడి ఏకత్వము స్థిరపడును. దీని ప్రకారముగా పైన పెర్కొనబడిని సూక్తి భావము ఇట్లుండును,అల్లాహ్ కు కుమారులు లేరు, అతడు ఎవ్వరికి కుమారుడు కాదు. అతడు ఏది అవసరం లేని శక్తి స్వభావము గలవాడు. తండ్రీ కొడుకుల అవసరం లేని మహా శక్తి అది. పవిత్ర ఖురాన్ నేర్పిన ఏకత్వము ఇది. విశ్వాసమునకు ఆధారము కూడా ఇదే.

అల్లాహ్ ఏకత్వమునకు బుద్ధిసంధమైన నిదర్శనము ఇస్తూ, పవిత్ర ఖురాన్ సూక్తులనుదహరిస్తూ

**హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం** ఇట్లు ఉపదేశించారు. అల్లాహ్ తాలా పవిత్ర ఖురాన్ లో ఇట్లు ఉపదేశించాడు. لَوْ كَانَ فِيْهِمَا اٰلِهَةٌ اِلَّا اللّٰهُ لَفَسَدَتَا

అనగా "ఈ రెండిటిలో అల్లాహ్ కు తప్ప మరెవరైన ఆరాధ్యదైవములుండినచో రెండూ నాశనమైయుండేవి." దీని భావమేమనగా ఆ ఇరు దేవుల్ల అనుయాయులు పరస్పరము వ్యతిరేకించుకుందురు. వారి పరస్పర వైరము వలన ప్రపంచములో పీడనము ఏర్పడును. సృష్టికర్తలు వేరువేరు అయినచో ప్రతి సృష్టి కర్త తన సృష్టి మేలు కొరకు ఇతరులను నాశనము చేయుచుండును. ఇది ప్రపంచ పీడనమునకు నాంది పలుకును. ఇస్లాం అను పదములో దాగివున్న యధార్థాన్ని మానవుడు పొందునట్లు చేయుటయే ఇస్లాం ధర్మ శాసనముల ముఖ్య ఉద్దేశము. అందువలనే అల్లాహ్ పట్ల ప్రేమను పెంపొందించుటకు దోహద పడు బోధనలు పవిత్ర ఖురాన్ లో గలవు. ఓ చోట అల్లామ్ సౌందర్యమును చూపించును, మరో చోట అతని ఉపకారములను గుర్తు చేయును. ఎందుకనగా రెండే విధములుగా ఇతరుల పై ప్రేమ పుట్టును, ఒకటి సౌందర్యాన్ని చూచి, మరొకటి ఉపకారము వలన. అల్లాహ్ సర్వ గుణములలో సాటిలేని వాడు. అతడిలో ఎలాంటి లోపము లేదు. అతడు సర్వ సద్గుణముల సమూహము. పవిత్ర శక్తులన్ని అతడి నుండి వెలువడును, సర్వ సృష్టికతడు ఉత్పత్తిస్థానము. సర్వ శుభములకతడు కేంద్రము. అంతిమ దినమున సర్వ అధికారములు అతడికే గలవు. సర్వ విషయాలకతడు శరణాలయము. దూరముండి కూడ దగ్గర గలడు, దగ్గరిండి కూడ దూరముండును. అతడు అందరి కంటే ఎత్తులో గలదు, అయినా అతడి కింద మరొకరు గలరని చెప్పలేము. అతడు అన్ని వస్తువుల కంటే గుప్తమైనవాడు. అయినా అతడి కంటే సుస్పష్టమైన వాడు మరొకడున్నాడని చెప్పలేము. అతడు సజీవుడు ప్రతి వస్తువు అతడితో జీవించును. అతడు స్థిరమైనవాడు, ప్రతీది అతడితో స్థిరంగా ఉండును. సమస్త ప్రాణులకు అతడే ఆధారము. అతడు లేనిదే ఏది పుట్టలేదు, జీవించనూ లేదు. అతడు ప్రతి దానిని ఆవరించి యున్నాడు. అయినా అతని ఆవరణము ఎట్లుండునో ఎవ్వరూ చెప్పలేరు. భూమ్యాకాశములో గల ప్రతి వస్తువు కాంతి అతడే మరియు ప్రతి కాంతి అతడితోనే ప్రకాశించినది. అతడి ఛాయ అది. అతడు సర్వ లోకాల పోషకుడు, ఆత్మలన్ని అతడితో పోషించబడును, అతడు ప్రసాధించిన శక్తులతోనే జీవించును. అతడి కరణ రెండు విధాలుగా నుండును. ఒకటి కర్మలకతీతముగా మొదలే ఈ ప్రపంచములో మన సౌకర్యము కొరకు ఏర్పాటు చేసినవి. ఉదా॥ భూమి, ఆకాశము, చంద్రుడు, నక్షత్రాలు, నీరు, నిప్పు , గాలి, వగైరాలు. అనగా మనకు అవసరమున్న ప్రతి వస్తువు మనము పుట్టక ముందే మన కర్మల ప్రమేయం లేకుండా మన కొరకు సిద్దము చేయబడినవి. నా ఫలానా క్రియ వలన సూర్యుడు పుట్టించబడినాడని లేదా నా మంచి పని వలన భూమి పుట్టించబడినదని ఎవరైనా చెప్పగలరా? అనగా మానవుని కర్మల కంటే ముందే, కర్మలకతీతముగా ఈ కరుణ బహిర్గతమైనది. రెండవ కరణ కర్మల వలన ఏర్పడును. (అందువలన పని చేయదలచినచో మంచి పని చేయుము. తద్వార అల్లాహ్ మంచి ఫలితాన్నిచ్చును.) ఇక అల్లాహ్ దరి చేరుటకు ఒకే మార్గము గలదు. అదే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వభావము. హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు. ఆ అధికారి, సత్యమైన, సంపూర్ణమైన అల్లాహ్ ను మన ఆత్మ, మన శరీర ప్రతి అణువు వంగి నమస్కరించును. అతడి నుండే ప్రతి ఆత్మ, ప్రపంచములో గల ప్రతి అణువు తమ సర్వశక్తులతో బహిర్గతమయ్యెను. అతని అస్తిత్వము వలనే ప్రతిదాని అస్తిత్వము స్థిరంగా నున్నది. అతడికి తెలియనిది, అతడి స్వాదీనములో లేనిది, అతడి సృష్టి కానిది

ఏది లేదు. గొప్ప చిహ్నముల ద్వారా తన అస్తిత్వాన్ని ప్రదర్శించుచూ, సర్వ శక్తులు గల తన ప్రకాశించు ముఖాన్ని చూపు ఆ సజీవ దైవాన్ని పరిచయం చేసిన ఆ పవిత్ర ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స.అ) పై వేలాది శుభములు, శాంతి కల్గుగాకా! మనము పొందిన ప్రవక్త మనకు దైవాన్ని చూపించాడు. తన సంపూర్ణ శక్తితో ప్రతి వస్తువును సృష్టించిన ఆ అల్లాహ్ ను మనము పొందినాము. అతడు గొప్ప వైభవోపేతుడు, అతని అనుమతి లేనిదే ఏది తన ఉనికిని ఏర్పరచుకోదు. అతడి సహకారం లేకుండా ఏది స్థిరంగా నుండదు. ఆ మా సత్యమైన దేవుడు ఎన్నో శుభములు గలవాడు, శక్తులుగలవాడు, సౌందర్యము గలవాడు, గొప్ప అనుగ్రహము గలవాడు, అతడు తప్ప మరేదైవము లేదు.

హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం దేవున్ని విశ్వసించని వారినుద్దేశించి ఇలా ఉపదేశించారు. అల్లాహ్ స్వభావము చాలా సున్నితమైనది, గుప్తమైనది. దీనిని మానవ జ్ఞానము స్వశక్తితో పొందలేదు. నాస్తికులు అల్లాహ్ ను తమ జ్ఞానముతో పొందాలనుకుంటారు. కాని ఇది అసాధ్యము. ఎందుకనగా జ్ఞానము ఈ ప్రపంచాన్ని చూచి సృష్టికర్త అవసరాన్ని గ్రహిస్తుంది. కాని ఏదైనా వస్తువును గ్రహించుట వేరు, దానిని స్వయముగా చూచుట వేరు. జ్ఞానము సంపూర్ణ మార్గము చూపదు. అందువలనే ప్రతి తత్వజ్ఞాని తన జ్ఞానము ద్వారా అల్లాహ్ ను గుర్తించలేడు. కేవలము జ్ఞానముతో అల్లాహ్ ను గుర్తించాలనుకొనెవారు చివరకు నాస్తికులుగా మారుతారు. విశ్వాసులనుద్దేశించి హజ్రత్ మసీహ్ మవూద్ అలైహిస్సలాం ఇలా ఉపదేశించారు. అల్లాహ్ యందు ఎన్నో వింతలు గలవు. సత్యవంతులకు, విశ్వాసులకు ఆ వింతలు కనిపించును. అతడి శక్తులను విశ్వసించనివాడిపై ఆ వింతలు బహిర్గతము కావు. తన దేవుడు సర్వాధికారియని తెలియని వాడు చాలా దురదృష్టవంతుడు. మా స్వర్గము మా దైవమే. మా గొప్ప అభిరుచులు మా దైవములో గలవు. ఎందుకనగా మేము అతడిని చూచితిమి. ప్రతి సౌందర్యాన్ని అతడిలో పొందితిమి. ఈ ధనము ప్రాణాన్ని అర్పించి పొందవలసినది. ఈ రత్నము అస్తిత్వాన్ని సమర్పించైనా ఖరీదు చేయదగినది. ఓ విరహితులారా! మీ దాహార్తిని తీర్చు ఆ చెలిమ వైపు పరుగెత్తుడు. అది మీకు జీవితాన్ని ప్రసాధించి రక్షించును. నేను ఏం చేయను? ఏ విధంగా ఈ శుభవార్తను హృదయాలల్లో పొందించదను.? ఇతడు మీ దేవుడని, జనులు వినుటకు ఏ డప్పుతో నేను వీధుల్లో దండోరా వేయాలి? మరియు ప్రజలు చెవులు విప్పి వినుటకు ఏ మందుతో చికిత్స చేయను?.

ఈ సజీవ దైవ సందేశాన్ని ఈ కాలపు ఇమాం, ఆన్ హజ్రత్ సల్లల్లాహు ప్రియ శిష్యుని అనుసరణలో ప్రపంచ నలువైపుల చేర్చి, సజీవ దైవం ఉన్నదని, ఇప్పుడు కూడ ప్రార్థనలు స్వీకరిస్తాడని, గొప్ప చిహ్నములు చూపుతాడని, అతడి వైపు పరుగెత్తుకుంటూ రావాలని ప్రపంచాన్ని మేల్కొలుపుటకు అల్లాహ్ మనను అనుగ్రహించుగాకా! అలాగే మనము కూడా ఆ అల్లాహ్ తో సజీవ సంబంధమేర్పరచుకొని, అతడి బోధనలను పాటించుచు అతడి అనుగ్రహమునకు పాత్రులమగుదుముగాకా! అలాగే మనము మరియు మన సంతతి సదా షిర్క్ నుండి దూరముందుముగాకా! (ఆమీన్)

**గమనిక:- ప్రతి జుమా ఖుత్బాలో హుజూర్ అన్వర్ (అ.బ.అ) గత ఖుత్బా జుమా సారాంశము విధిగా చదివి వినిపించగలరు.**